క్లుప్తంగా

మధురంగా సాగిన గాత్ర సంగీత కచేరీ



విజయవాడ కల్చరల్: నెలనెలా యువరాగం కార్యక్రమంలో భాగంగా శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని మహతి హాల్‌లో శనివారం గాత్ర సంగీత విద్వాంసురాలు తుషార పూర్ణవల్లి నిర్వహించిన కర్నాటక సంగీత గాత్ర కచేరీ మధురంగా సాగింది. వాగ్గేయకారులు రచించిన పలు సంప్రదాయ కీర్తనలను ఆమె మధురంగా ఆలపించింది. వయోలిన్‌పై కే సుబ్రహ్మణ్యరాజు, మృదంగంపై సీహెచ్ హరినాథ్ సహకరించారు. సంస్థ కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ మాట్లాడుతూ యువగాయనీ గాయకులను ప్రోత్సహించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతిభను ప్రోత్సహించాలని సూచించారు. సంగీత విద్వాంసురాలు గాయత్రి గౌరీనాథ్ పాల్గొన్నారు. గాయకులను నిర్వాహకులు సత్కరించారు.

దొంగతనం కేసు కొట్టివేత

విజయవాడలీగల్: తోడికోడలిపై పెట్టిన దొంగతనం కేసును విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసింది. వన్‌టౌన్ వించిపేటకు చెందిన సుతారి శ్రీలత తన ఇంట్లో చోరీకి పాల్పడిందని ఆమె తోడి కోడలు సుతారి వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2020లో వెలుగు చూసిన ఈ ఘటనపై న్యాయస్థానంలో వాదోపవాదనలు జరిగాయి. తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో బంగారం చోరీ చేశారని శ్రీలతపై అభియోగం మోపారు. సుదీర్ఘ విచారణ చేసిన న్యాయస్థానం పోలీసుల సమక్షంలో సాక్షులను విచారించింది. విచారణ అనంతరం శ్రీలతపై మోపిన అభియోగం సరైనది కాదని న్యాయస్థానం అభిప్రాయపడింది. నిందితురాలిగా పోలీసులు పేర్కొన్న సుతారి శ్రీలత ఎటువంటి తప్పు చేయలేదని నిరూపణ కావడంతో ఈ కేసును న్యాయస్థానం కొట్టివేసింది.

విజేత జట్టుకు అభినందనలు



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ కళాశాల పురుషుల జట్టు అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి రన్నర్ ట్రోఫీని అందుకుందని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వ్యాయామ విద్యా అధ్యాపకులు డాక్టర్ టి.వి.బి.కృష్ణారెడ్డి తెలిపారు. ఇటీవల మైలవరంలోని డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారన్నారు. రన్నర్ ట్రోఫీని సాధించిన పీబీ సిద్ధార్థ జట్టు సభ్యులను శనివారం కళాశాల ప్రాంగణంలో కాలేజీ అధ్యక్షులు డాక్టర్ సి.నాగేశ్వరరావు, కార్యదర్శి పి.లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, డైరెక్టర్ వి.బాబురావు, డీన్ రాజేష్ అభినందించారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్‌సీపీ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని...పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా నియమితులైన తోపుల వరలక్ష్మి శనివారం మాజీఎమ్మెల్యే మల్లాది విష్ణును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు పనిచేసే వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. తోపుల వరలక్ష్మి మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన నేతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వివరించారు. అనంతరం తోపుల వరలక్ష్మిని మల్లాది విష్ణు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని తోపుల వరలక్ష్మిని అభినందించారు.

470 మందికి వైద్యపరీక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానిపురం శ్రీభవాని హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 470మంది పేదలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వెనిగళ్ల చంద్రశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైద్యశిబిరంలో ప్రతి ఒక్కరికి రూ. 2వేల విలువైన ఉచిత రక్త పరీక్షలు, ఎక్స్ రే తదితర పరీక్షలు చేసినట్లు తెలిపారు. డయాబెటిక్ పేషెంట్లకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఉచిత ఓపీని అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో యూరాలజిస్ట్ డాక్టర్ అభిషేక్, చీఫ్ మెడికల్ అడ్మినిస్ట్రేటర్ ఎస్ పి.దిలీప్‌కుమార్, డాక్టర్ అక్షయ్ పాల్గొన్నారు.

ఆగని ఆక్రమణలు

- యథేచ్ఛగా రోడ్ల ఆక్రమణలు
- దుకాణాలు, హోటళ్ల ఏర్పాటు
- అక్రమార్కులకు అధికార పార్టీ నాయకుల అండదండలు
- నిద్రమత్తు వీడని ప్లానింగ్ సిబ్బంది



కండ్రికలో ఫుట్‌పాత్‌పై కొత్తగా వెలిసిన హోటల్

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వంతెన సమీపంలోని అన్న క్యాంటీన్ పరిసరాలు ఆక్రమణదారులకు అడ్డాగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో పలువురు ఇష్టారాజ్యంగా దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఓ వ్యక్తి ఏకంగా రోడ్డు పక్కన బోర్ సైతం వేయించి చేపల దుకాణం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ విషయంపై గతంలో 'సాక్షి' దినపత్రిక కథనాలు ప్రచురించడంతో స్పందించిన అధికారులు ఆయా ఆక్రమణలను తొలగించగా, ఇటీవల మరికొందరు ఆక్రమణదారులు మరో మారు ఆక్రమణలకు తెర తీశారు. వీరికి స్థానిక కార్పొరేషన్ అధికారులే సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేపలు, పూలు, పండ్ల వ్యాపారులు బడ్డీలు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసి మరీ విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో రోడ్డు మార్జిన్లు లేక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అసలే ప్రమాదాలు అధికంగా జరిగే ఈ ప్రాంతంలో ఆక్రమణల కారణంగా మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చేపల వ్యాపారం కారణంగా ఇక్కడ పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారడంతోపాటు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించడంతో పాటు మరోమారు ఆక్రమణలు జరగకుండా బుడమేరు పక్కన ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



చేపల విక్రయాల కోసం ఏర్పాటు చేసిన సిలిండర్లు, థర్మోకాయిల్ ట్రేలు



బుడమేరు పక్కన వ్యాపారుల ఆక్రమణలు

కండ్రికలో వెలిసిన హోటళ్లు..

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక మెయిన్‌రోడ్డులో ఆక్రమణలు ఏమాత్రం ఆగడం లేదు. కొందరు వ్యక్తులు స్థానిక అధికారపార్టీ నాయకుల అండదండలతో మెయిన్‌రోడ్డు ఫుట్‌పాత్‌ని సైతం ఆక్రమించి హోటళ్లు ఏర్పాటు చేస్తున్నా, వీఎంసీ ప్లానింగ్ విభాగం సిబ్బంది మాత్రం చోద్యం చూస్తున్నారు. ఆక్రమణలను తొలగించాలని వీఎంసి ఉన్నతాధికారులు ప్లానింగ్ విభాగం అధికారులు జారీచేస్తున్న ఆదేశాలను సైతం ఆవిభాగం సిబ్బంది పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కండ్రిక మెయిన్‌రోడ్డులోని ఓ కంప్యూటర్స్ సెంటర్‌లో వివిధ పోటీ పరీక్షలు, బ్యాంక్ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తుంటారు. దీంతో ఈరోడ్డులో రద్దీ అధికంగా ఉంటుంది. ఈక్రమంలో ఈ రోడ్డులో ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్యలు సైతం మరింత పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా వీఎంసీ ప్లానింగ్ విభాగం అధికారులు నిద్రమత్తును వీడి ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

భారతీయ నృత్య సంప్రదాయాలు విశిష్టమైనవి



నృత్య పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పీవీఎన్ కృష్ణ తదితరులు



చిన్నారులకు జ్ఞాపికలను అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: భారతీయ నృత్య సంప్రదాయాలు విశిష్టమైనవని సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ అన్నారు. సంస్కార భారతి మహానగర్, సుమధర కళానికేతన్ ఆధ్వర్యంలో భరతముని జయంతి సందర్భంగా రెండురోజుల పాటు నిర్వహించే జాతీయ సంప్రదాయ నృత్య పోటీలు గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సంస్కారభారతి ద్వారా బాలబాలికలలోని ప్రతిభను గుర్తించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతను దేశ భక్తివైపు మళ్లించి వారిని ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. సంస్కార భారతి నగర అధ్యక్షుడు పసుమర్తి భాస్కర శర్మ మాట్లాడుతూ నాట్యశాస్త్రానికి గురుతుల్యుడైన భరతముని సేవలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో పోటీలను నిర్వహిస్తునట్లు తెలిపారు. తొలి రోజు కార్యక్రమంలో సోలో విభాగంలో భరతనాట్యం, కూచిపూడి, ఆంధ్రనాట్యం అంశాల్లో పోటీలు నిర్వహించారు. నగరంలోని ఆరు ప్రాంతాల్లో నిర్వహించిన ఈ పోటీలను సంస్కార భారతి క్రియాశీలక సభ్యులు శ్రావణ్‌కుమార్, సాయిశంకర్, సీతాలక్ష్మి, బి.రూపశ్రీ, జీఎస్‌డీ కుసుమసాయి, చింతా దూండీ కృష్ణ పర్యవేక్షించారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

పద్యనాటక వైభవాన్ని చాటిన ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, శ్రీదేవీ కళా నాట్యమండలి, కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం ప్రదర్శించిన పద్యనాటకాలు నాటక వైభవాన్ని చాటాయి. విద్వాన్ కణ్వశ్రీ రచించిన బాలనాగమ్మ నాటికను మనోహరంగా ప్రదర్శించారు. ఎస్ విజయలక్ష్మి బాలనాగమ్మగా, జెట్టి సాంబశివరావు మాయప ఫకీరుగా, కార్యవర్ధిరాజుగా డీవీ నరసింహారావు, బాలవర్ధి రాజుగా జీవన్‌కుమార్ పాత్రోచితంగా నటించారు. రెండవనాటికగా బలిజేపల్లి లక్ష్మీకాంతకవి రచించిన సత్యహరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను ఘట్టాన్ని ప్రదర్శించారు. పావులూరి పాములు హరిశ్చంద్రునిగా, అడపా ప్రభావతి చంద్రమతిగా, నక్షత్రకునిగా గాబ్రియేలు కాలకౌశికునిగా నెక్కంటి సాంబశివరావు నటించారు. జాషువా కవి రచించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు కొయ్యూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పద్యనాటకం తెలుగువారి ఆత్మ అని అభివర్ణించారు.



బాలనాగమ్మ నాటకంలోని ఓ సన్నివేశం

అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశ స్వాతంత్ర్యం కోసం, జాతి అభ్యున్నతి కోసం మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో శనివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన, ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విష్ణు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా, భారత తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. విద్యావ్యవస్థలో ఆయన తీసుకొచ్చిన మార్పులు విప్లవాత్మకమని కొనియాడారు. మైనారీల అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆజాద్‌కు నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, అలంపూర్ విజయ్, ఎండి ఇస్మాయిల్, చల్లా సుధాకర్, తోపుల వరలక్ష్మి, నందెపు సురేష్, కాళ్ల ఆదినారాయణ, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి, అలీ, హుస్సేన్ ఉన్నారు.

ఏఎంసీ ఆధ్వర్యంలో..

పాయకాపురం(విజయవాడరూరల్): దేశ తొలి విద్యాశాఖా మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశంలో విద్యాభివృద్ధికి ఎనలేని కృషిచేశారని ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా కొనియాడారు. 64వ డివిజన్ కండ్రికలో డివిజన్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ గుణాత్మక విద్యకు మార్గదర్శి ఆజాద్ అన్నారు.తొలి ఐఐటీ వ్యవస్థాపకుడు ఆజాద్ అని గుర్తుచేశారు. ఆజాద్‌కు నివాళులర్పించిన వారిలో ఏఎంసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్‌అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు యండి కాలేషా, రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి, జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ ఖాజా, నగర ప్రధాన కార్యదర్శి యండీ ఇస్మాయిల్, కమిటీ ప్రతినిధులు ఉన్నారు.



ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న ఏఎంసీ నాయకులు

అన్నదమ్ములపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సోదరుల నుంచి తనకు రక్షణ కల్పించాలంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె సోదరులిద్దరిపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు...నిమ్మగడ్డ అనురాధ అనే మహిళ తనభర్త, కుమారుడితో కలిసి గొల్లపూడి వన్‌సెంటర్‌లోని సాయికృష్ణ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటోంది. ఆమెకు సోదరులు ఆలూరి సుబ్బారావు(సుబ్బయ్య), హరికృష్ణచౌదరి(చిన్నా) ఉన్నారు. అనురాధ శుక్రవారం రాత్రి గొల్లపూడి సాయిపురం కాలనీలో బంధువుల గృహప్రవేశానికి వెళ్లింది. అదే ఫంక్షన్‌లో పెద్ద సోదరుడు ఆలూరి సుబ్బయ్య ఆమెను నానాదుర్భాషలాడి ఆమెపై ఉమ్మివేశాడు. తిరిగి అపార్ట్‌మెంట్‌కు చేరుకున్న తర్వాత సెల్లారులో సోదరులు సుబ్బయ్య, చిన్నా ఇద్దరూ కలిసి ఆమెపై దాడి చేశారు. ఆమె మంగళసూత్రం తెంచి చంపేందుకు ప్రయత్నించారు. ఆమె భర్తను చంపుతామని బెదిరించారు. ఫ్లాట్‌కు వేరే మనిషిని పంపి భయభ్రాంతులకు గురిచేశారని అనురాధ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన ఇద్దరు సోదరుల నుంచి రక్షణ కల్పించాలంటూ పోలీసులను వేడుకుంది. అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన



మధురానగర్(విజయవాడసెంట్రల్): సిమెంట్ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి సూచించారు. 26వ డివిజన్ మాచవరం డౌన్ కుటుంబరావు వీధిలో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులను శనివారం ఆమె పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పాటించడంతోపాటు త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తోట పాండు, వల్లభనేని సతీష్, కె.సత్య తదితరులు పాల్గొన్నారు.

కన్నెగంటికి నివాళి

పాయకాపురం(విజయవాడరూరల్): స్వాతంత్ర సమరయోధుడు, పుల్లరి ఉద్యమ నేత కన్నెగంటి హనుమంతు పేరును పల్నాడు జిల్లాకు పెట్టాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కన్నెగంటి 103వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు నివాళులర్పించారు. పల్నాడు జిల్లా ప్రజల కోసం ప్రాణాలర్పించిన కన్నెగంటి పేరును ఆజిల్లాకు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆన్‌లైన్ కోర్సులతో మరిన్ని అవకాశాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఇందుకోసం ఆన్‌లైన్ కోర్సులను ఉపయోగించుకోవాలని కాశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హిమబిందు సూచించారు.స్థానిక మాచవరం ఎస్ ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం ఆమె అతిథి ఉపన్యాసం ఇచ్చారు. డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా యుజిసి ప్రారంభించిన స్వయం మూక్స్‌లో ఉన్న ఆన్‌లైన్ కోర్సులు వాటి వివరాలు, ఏ విధంగా రిజిస్టర్ చేసుకోవాలి, ఆయా కోర్సులను పూర్తిచేసేందుకు పాటించాల్సిన నియమాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాశ్మీర్ విశ్వవిద్యాలయం నుంచి వచ్చి తమ విద్యార్థులకు అతిథి ఉపన్యాసం ఇవ్వడం అభినందనీయమంటూ డాక్టర్ హిమబిందును అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ కొల్లేటి రమేష్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బాలసుబ్రమణ్యం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ హిమబిందును సత్కరిస్తున్న అధ్యాపకులు

నిద్రలేమితో దీర్ఘకాల వ్యాధులు

పాయకాపురం(విజయవాడరూరల్): ఆహారం సరిగా తీసుకోకపోవడం, వ్యాయామం చేయకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం ద్వారా దీర్ఘకాల వ్యాధులు సంక్రమిస్తాయని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగశేషమ్మ పేర్కొన్నారు. స్థానిక రాజీవ్‌నగర్లోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం ఆమె ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు సేవలను అందించాలని సూచించారు. డాక్టర్ వంశీలాల్ రాథోడ్ మాట్లాడుతూ విపత్తు సమయాల్లో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల సేవలు ఎంతో కీలకమని వివరించారు. ఏపీ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్ జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.రమేష్, దంత వైద్యాధికారి డాక్టర్ భాస్కర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి కడియం శ్రీదేవి, సహాయ అధికారిణి యండి హసీనా, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థులు కలిసి నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నాగశేషమ్మ తదితరులు

మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

వీఎంసీ ఇన్‌చార్జ్ సీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంటింటికీ వెళ్లి వ్యర్థాలు సేకరించడమే కాకుండా అక్కడే సెగ్రిగేషన్ చేసి నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలని నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం శానిటరీ సెక్రటరీలు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ల సర్వైలెన్స్‌ల ద్వారా నగరంలో ఉన్న వ్యర్థాలను గుర్తించడమే కాకుండా వాటిని సత్వరమే తొలగించేలా ఎంత మంది శానిటరీ సిబ్బంది చర్యలు తీసుకున్నారు, పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయి, అందుకు గల కారణాలు ఏమిటని అడిగి తెలుసుకున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్‌పై విస్తృత ప్రచారం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ శానిటరీ సెక్రటరీలు అందరూ తమ పరిధిలోగల షాపుల యజమానులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

మార్చి1 నుంచి చట్టరీత్యా చర్యలు చేపట్టండి

మార్చి ఒకటవ తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు చేపట్టాలని డాక్టర్ సురేష్ బాబు ఆదేశాలు జారీ చేశారు. దోమకాటు వలన ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా నిరంతరం యాంటీ లార్వా ఆపరేషన్లు జరుగుతుండాలన్నారు. ఫాగింగ్, ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే కూడా జరగాలని మలేరియా సిబ్బందికి చెప్పారు. సమావేశంలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, వెహికల్ డిపో ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యేసుపాదం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి.సోమశేఖరరెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపీ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాలలో ఐప్రాసెసింగ్(ఐసీఐసీఐ బ్యాంక్), హెచ్‌డీబి ఫైనాన్షియల్ సర్వీసెస్ వారు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 45మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ శనివారం తెలిపారు. ఐప్రాసెసింగ్‌లో బ్యాకెండ్ ఆపరేషన్స్, సేల్స్ ఆపరేషన్స్ పోస్టులకు 23మంది ఎంపిక కాగా, హెచ్‌డీబి ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో సేల్స్ ఆఫీసర్ పోస్టులకు 22మంది విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు. ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారు మార్చి 5వతేదీన ఉద్యోగంలో జాయిన్ అవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు అభినందనలు తెలియజేశారు.

సామాజిక బాధ్యత పెంపొందించుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శరవణకుమార్ అన్నారు. ఆ కళాశాల డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం చిర్రావూరు గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కళాశాలలో జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా సమాజాన్ని అర్థం చేసుకోవటానికి అవకాశమున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యంగా ప్రజల స్థితిగతులతో పాటుగా ఆర్థిక, సామాజిక అంశాలను తెలుసుకుని తమను తాము తీర్చిదిద్దుకోవాలన్నారు. తద్వారా విద్యార్థులు భావవ్యక్తీకరణ సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకుడు కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంపోస్ట్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం రైతుబజారులో నిరుపయోగంగా ఉన్న కంపోస్ట్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా వినియోగదార్ల పరిరక్షణ కౌన్సిల్ జిల్లా సభ్యుడు కుప్పం బాలాజీ వరప్రసాద్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆయన శనివారం పాయకాపురం రైతుబజార్‌ను సందర్శించి, వినియోగదారులకు అందుతున్న సేవలు పరిశీలించారు. రైతు బజారులో విక్రయిస్తున్న కూరగాయల నాణ్యత,ధరలు, వినియోగదారులకు అందుబాటులో ఉన్న వసతులపై పలువురుని అడిగి తెలుసుకున్నారు. కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న కంపోస్ట్ ప్లాంట్‌ను పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన ప్లాంట్ నిరుపయోగంగా మారిందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను కోరారు.



నిరుపయోగంగా ఉన్న కంపోస్ట్ ప్లాంట్